క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

సీటీఆర్ఐ: తాము చదివిన పాఠశాలలోని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు పుస్తకాలను, మెరిట్ విద్యార్థులకు నగదు అందజేశారు. ఎస్‌కేవీటీ స్కూల్లో 30 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు శనివారం స్కూలుకు వచ్చారు. ఎస్‌కేవీటీ అల్యూమినీ ట్రస్టు పేరుతో ఏర్పడి, ఒకటి నుంచి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. పదోతరగతిలో 550 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు సాండిల్య హోతా, జానీ, విశ్రాంతి ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అరుణ్, రవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

302 మందికి వైద్య పరీక్షలు

కడియం: ఏపీ పేపర్‌మిల్లు సహకారంతో మురమండలోని కల్యాణ మంటపంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం, రాజమహేంద్రవరానికి చెందిన రమా డెంటల్ హాస్పిటల్‌కు చెంది వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేశ్ జైన్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్ తదితరులు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. 302 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 167 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. అలాగే 51 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ, ఎస్.నాగసాయిమౌర్య తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న రాయితీ

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం, బొమ్మూరు, రాజవోలు గ్రామాలలో సొంత ఇల్లు కలిగిన విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును 50 శాతం రాయితీతో సోమవారం లోపు క్రమబద్ధీకరించుకోవాలని ఏపీఈపీడీసీఎల్(ఆపరేషన్) ఏఈ బెల్లపు శ్రీనుబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ధవళేశ్వరం సెక్షన్ పరిధిలో 30,871 గృహ సర్వీసులకు 1,269 సర్వీసులు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేనిపక్షంలో అదనపు లోడుపై కేసులు రాస్తారని తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి, ఎం.శ్రీరామమూర్తి, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కె.పార్థసారథి ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఫీజు రాయితీ కోసం అడిగారు. దానిపై స్పందించిన కలెక్టర్ ఈ నెల 26న దీనికి సంబంధించిన సర్క్యులర్ జారీ చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఈ ఉత్తర్వులు అమలయ్యేలా జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసర్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా.. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని విలేకరులను శ్రీరామమూర్తి, పార్థసారథి కోరారు.

ఒకటిన సీఎం చంద్రబాబు పర్యటన

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై ఒకటిన కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆరోజు జరిగే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు శనివారం రాత్రి కలెక్టర్‌తో సీఎంవో కార్యాలయం నుంచి ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, దాత కిరణ్‌కుమార్

కడియం: దుళ్లలోని ఒకటో నంబర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం 600 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంటిపూడి కిరణ్ కుమార్ ఏటా ఇలా విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యాభివృద్ధికి కిరణ్ చేస్తున్న సేవలను అభినందించారు. హెచ్ఎం గెద్దం ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆంద్ర చిట్టిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ తుస్సేనా..

- రవాణా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలో మార్పులు
- ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిన కూటమి ప్రభుత్వం
- అవినీతి పెరిగిపోయే ప్రమాదం
- కండీషన్‌లో లేని వాహనాలు తిరిగే అవకాశం
- ప్రభుత్వ తీరును ఖండించిన అఖిలపక్షం నాయకులు



సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు



హాజరైన రవాణా కార్మికులు

సీటీఆర్ఐ: రోడ్డుపై నిత్యం వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వాటిలో సరకులను రవాణా చేసే లారీలు, ప్రయాణికులను తీసుకువెళ్లే బస్సులు, ఆటోలు, స్కూల్ పిల్లల వ్యాన్లు తదితర వాహనాలు ఉంటాయి. ఇవన్నీ మంచి కండీషన్‌లో ఉన్నప్పుడే ప్రయాణికులు సురక్షితంగా ఉంటారు. అందుకే వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు. రవాణాశాఖాధికారులు ఆ వాహనాన్ని పూర్తిగా పరిశీలించి, తనిఖీ చేసి ఆ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీని వల్ల వాహనాల యజమానులు ఎప్పటికప్పుడు తమ వాహనాన్ని కండీషన్‌లో ఉంచుకుంటున్నారు. కానీ ఇదంగా గతంలో విషయం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట సంస్థలకు అప్పగించింది. ప్రభుత్వ అధికారుల నియంత్రణ లేకపోవడం వల్ల ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరిగే ప్రమాదం ఉందని, సర్టిఫికెట్ల జారీలో అవినీతి పెరిగిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనేక ఇబ్బందులు

రవాణా వాహనాల ఫిట్‌నెస్ (బ్రేక్)ను రవాణా శాఖ అధికారుల నుంచి ప్రైవేట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం అప్పజెప్పడం వల్ల రవాణా కార్మికులకు ఇబ్బందులు కలుగుతాయి. ఈ నేపథ్యంలో ఆ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ నేతృత్వంలో ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్లో అఖిల పక్ష పార్టీల సమావేశం జరిగింది. దీనికి మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, మార్గాని భరత్ రామ్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, పలు కార్మిక సంఘాలు, వివిధ యూనియన్ల నాయకులు విచ్చేశారు. ఏఐయూసీ నాయకులు రెడ్డి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు వైకేఎల్, కేఎల్ నరసింహారెడ్డి, డీవీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉభయ రాష్ట్రాల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.నారాయణరావు, ముచ్చకర్ల సత్యనారాయణ, పోలేపల్లి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, తొండపు లక్ష్మీనరసింహారావు, బి.పవన్, పూర్ణిమారాజ్, ఆటో, చిన్న కార్లు, గూడ్స్ ఆటోలు, మినీ వ్యాన్ల ఓనర్ కమ్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి



ఏపీలో ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళన చేయడానికి అందరూ సంసిద్ధం కావాలి. దీనితో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్ సీపీ నిర్వహించే పోరాటాల్లో కలిసి రావాలి. రవాణా కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఫిట్‌నెస్ విషయంలో ప్రభుత్వం నిర్ణయం సరికాదు. కండీషన్‌లో లేని వాహనాలు రోడ్డుపైకి వస్తే అనేక ప్రమాదాలు జరుగుతాయి.

– మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ

కార్మికులకు అండగా ఉంటా



ప్రైవేట్ సంస్థలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం ఇవ్వడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయి. ప్రభుత్వం నుంచి త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాను. రవాణా కార్మికులకు అవసరమైన న్యాయ సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. వారి సమస్య పరిష్కారమయ్యే వరకూ భాగస్వామిగా పనిచేస్తాను.

– ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ

చాలా ప్రమాదం



వాహనాల ఫిట్‌నెస్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం చాలా ప్రమాదం. దీనివల్ల కండీషన్‌లో లేని వాహనాలు రోడ్డుపైకి వస్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా రవాణా కార్మికులకు ఏ మంచీ చేయలేదు. పైగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ప్రైవేట్ పరం చేసి, కార్మికులను ఇబ్బంది పెడుతోంది. ఈ విధానం వల్ల అవినీతి పెరిగే ప్రమాదం ఉంది. పేద రవాణా కార్మికులు మాత్రం సర్టిఫికెట్ తీసుకోవడానికి చాలా ఇబ్బందులు పడతారు.

– తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి

రద్దు చేసే వరకూ పోరాటం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ తగిలేలా ఈ ఫిట్‌నెస్ విధానాన్ని రద్దు చేసే వరకూ ఉద్యమిస్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ రవాణా రంగ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు చేతల్లోకి మారేలా ప్రభుత్వం రవాణా కార్మికులపై నిర్ణయాలు తీసుకోవాలి.

– వాసంశెట్టి గంగాధర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

కౌలు రైతులకు రుణాలివ్వకపోతే సహించను



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో జేసీ చిన్నరాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కౌలు రైతులకు రుణాలివ్వడంలో ఉపేక్షిస్తే సహించనని కాకినాడ, ఏలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల (డీసీసీబీ) అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ, జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సహకార సంఘాల రికార్డులను తనిఖీ చేయాలని అన్నారు. కార్యకలాపాలు నిర్వహించని, మనుగడలో లేని సొసైటీల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, కో ఆపరేటివ్ సొసైటీ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా, పని చేయడంలో విఫలమైన సొసైటీలను రద్దు చేసి, నగదు లావాదేవీలు, అనుబంధ, ఇతర రికార్డులను సీజ్ చేయాలని అన్నారు. కౌలు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వడం లేదో వివరించాలని డీసీసీబీ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా సహకార అధికారి ఎంవీ వెంకట రమణ మాట్లాడుతూ, సొసైటీ సభ్యుల ఈ–కేవైసీ 89 శాతం పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన



గురుమూర్తిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గోపాలం

కడియం: కడియపులంకలోని ఈలి గోపాలం నర్సరీని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి, కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వివిధ రకాల మొక్కల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.

సెంట్రల్ జైలు పరిశీలన

కంబాలచెరువు: స్థానిక కేంద్ర కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో నియమించిన పారాలీగల్ వలంటీర్లను ఉద్దేశించి న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయసేవలపై వారందరికీ తెలియజేయాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. వారి తరపున వాదించేందుకు న్యాయవాదిని ఉచితంగా నియమిస్తామన్నారు.

మున్సిపల్ వర్కర్‌కు వైద్యసాయం

రాజమహేంద్రవరం సిటీ: కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన పారిశుద్ధ్య ట్రై సైకిల్ కార్మికురాలు అల్లం బాపనమ్మకు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నగర పాలకసంస్థ అందజేసేందుకు హామీ ఇచ్చిందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు యూనియన్ నాయకులు తాటిపాక మధు, రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరరావు తదితరులు వైద్యం ఇతర సహాయ సహకారాలపై చర్చించారు. తాటిపాక మధు మాట్లాడుతూ కారు ప్రమాదంలో అల్లం బాపనమ్మకు రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర ప్రమాదం జరిగిందన్నారు. సంఘటన జరిగిన వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కిమ్స్ ఆస్పత్రికి తరలించారన్నారు. ఆమెకు ప్రభుత్వమే పూర్తి వైద్య సహాయం అందించాలని ఆమె కోలుకునే వరకు ప్రభుత్వమే జీతం ఇవ్వాలన్నారు.

మంత్రి దుర్గేష్ పరామర్శ

కడియం: బుర్రిలంకకు చెందిన రత్నం రామారావు (బాబులు) ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, నర్సరీ రైతులు ఉన్నారు.

పని ఒత్తిడి భరించలేకపోతున్నాం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

- మమ్మల్ని పని దొంగలుగా చూడొద్దు
- కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్యదర్శుల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: రోజూ ఉదయం ఆరు గంటలకే గ్రామాల్లో విధులకు హాజరై.. ఆ రోజు దినపత్రికతో ఫోటో దిగి, దాన్ని పంచాయతీరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలంటూ టీడీపీ కూటమి ప్రభుత్వం, ఆ శాఖ ఉన్నతాధికారులు మౌఖికంగా జారీ చేసిన ఆదేశాలను నిరసిస్తూ పంచాయతీ కార్యదర్శులు శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఏపీ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించి, అనంతరం జాయింట్ కలెక్టర్ చిన్నరాముడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులపై తీవ్రమైన పనిఒత్తిడి పెడుతున్నారన్నారు. గతంలో వలంటీర్లు చేసిన సర్వే పనుల భారమంతా తమపై పడుతోందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ తమకు జారీ చేసిన ఆదేశాలు అవమానించేలా ఉన్నాయని వాపోయారు. పేపరు పట్టుకుని నిలబడి ఫొటోలు దిగాలని చెప్పడం చూస్తుంటే తమను పని దొంగలుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకుండా విజయవాడలో మూడు రోజులు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఘనపారాయణ తపస్సు వంటిదే..



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారామచంద్ర ఘనపాఠి

రాజమహేంద్రవరం రూరల్: సంపూర్ణ ఘనపారాయణను శ్రవణం చేయడమే తపస్సుగా భావించిన యతీశ్వరులెందరో ఉన్నారని శ్రీ దత్తాత్రేయ వేద విద్యా గురుకులం వ్యవస్థాపకుడు, వేదార్థ చూడామణి గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠి అన్నారు. కొంతమూరులో ఆయన నెలకొల్పిన గురుకులం రజతోత్సవాల్లో భాగంగా, సంపూర్ణ కృష్ణయజుర్వేద ఘనపారాయణ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగద్గురు ఆదిశంకర భగవత్పాదులు కూడా కృష్ణ యజుర్వేద ఘనపాఠి విద్వంశంలో జన్మించారని అన్నారు. ఈ పారాయణ చేసినా, విన్నా, ఐహిక, ఆముష్మిక శుభాలు కలుగుతాయని వివరించారు. రాజమహేంద్రవరంలో సుమారు 67 ఏళ్ల తరువాత పవిత్ర గోదావరి తీరాన ఉన్న ఈ గురుకులం రజతోత్సవ సంవత్సరంలో ఘనపారాయణ జరగడం ముదావహమని అన్నారు. వేదమాత ఆశీస్సులతో ఈ కార్యక్రమం జయప్రదం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఇదే పాఠశాలలో వేదవిద్యను అభ్యసించిన ఘనపాఠులు ఘనపారాయణ ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, వేద పండితులు దువ్వూరి సూర్యప్రకాశావధానులు, భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, నగర ప్రముఖులు దాట్ల బుచ్చి వేంకటపతిరాజు, దాట్ల భాస్కరరాజు, గురుకులం అధ్యక్షుడు పాలెపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఘనపారాయణ వచ్చే నెల 27వ తేదీ వరకూ కొనసాగుతుంది.

నల్సా చట్టాలపై అవగాహన అవసరం



స్వయం సహాయక సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- ఆనం కళాకేంద్రంలో అవగాహన కార్యక్రమం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ నల్సా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. నల్సా చట్టాల నూతన విధానాలపై శనివారం ఆనం కళాకేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రూ.5 కోట్ల చెక్కు, మెప్మా ఆధ్వర్యంలో 3.60 కోట్ల చెక్కు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినికిడి యంత్ర పరికరాలు, వీల్ చైర్, బ్రెయిలీ లిపి పుస్తకాలు, స్త్రీ నిధికి లక్ష రూపాయలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో బాలలు చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలకు దర్పణం పట్టేలా ఇచ్చిన ప్రదర్శనలను అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆర్థిక చేయూత, ఉపకరణాల పంపిణీ, ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్.. మెప్మా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక్ పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు, నవోదయం 2.0 కార్యక్రమ నిర్వహణకు అధికారులు కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి రాజమండ్రి జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా నిందితులను బైండోవర్ చేయాలని, సారా తయారీకి బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై నిఘా ఉంచాలన్నారు. పలు కేసుల్లో ముద్దాయిల ప్రవర్తనను పరిశీలించి, ఇంకా సారా వ్యాపారం చేస్తుంటే పీడీ యాక్ట్ పెట్టాలని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా శుద్ధి చేసిన మద్యం, నకిలీ మద్యం, ఇతర ఎక్సైజ్ సంబంధిత ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 14405కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళి, అసిస్టెంట్ కమిషనర్ ఎం.శివప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య పాల్గొన్నారు.

హాస్యంపై చెరగని సంతకం ముళ్లపూడి



ముళ్లపూడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: హాస్యంపై చెరగని సంతకం ముళ్లపూడి అని ఆదిత్య కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రమాదేవి అన్నారు. ఎస్‌వీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమీ ఆధ్వర్యంలో శనివారం ముళ్లపూడి వెంకటరమణ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ మరణించి కూడా జీవిస్తూ ఉండడం అందరికీ సాధ్యం కాదని, ముళ్లపూడి వంటి గొప్ప వ్యక్తులకే వీలవుతుందన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ వినోదం, లోక జ్ఞానం, జీవిత సాగరంలోని సమస్త కష్టనష్టాలను హాస్యంలో రంగరించి ఆవిష్కరింపచేసిన రమణీయ రసానందుడు ముళ్లపూడి అన్నారు. డాక్టర్ వై.స్వర్ణశ్రీ, అధ్యాపకులు పల్లి సుధ, జె.సుగుణ, ఎన్.రవికృష్ణ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: మార్గన్
సూర్యమినీ	: ఎఫ్–1 దిమూవీ
సూర్యప్యాలెస్	: కన్నప్ప
స్వామి	: కుబేర
అనుశ్రీ	: కన్నప్ప
రాజా	: కన్నప్ప
శివజ్యోతి	: కుబేర
ఊర్వశి	: 8 వసంతాలు
మేనక	: చంద్రేశ్వర, హనుమాన్ జంక్షన్
రంభ	: మా
అప్సర	: కన్నప్ప
అశోక నామవరం	: కన్నప్ప
డీఎస్ మహల్ ధవళేశ్వరం	: కన్నప్ప
మురళీకృష్ణ కడియం	: కన్నప్ప
వెంకటసూర్య	: కన్నప్ప

అక్రమ కేసులపై కాదు.. పథకాలపై శ్రద్ధ పెట్టండి

- కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే రాజా హితవు
- రాపాకలో 'నా కార్యకర్తలు – నా కుటుంబం'
- తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రాపాకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడంలో చూపిస్తున్న శ్రద్ధను సూపర్ సిక్స్ పథకాల అమలుపై చూపాలని కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హితవు పలికారు. మండలంలోని రాపాకలో శనివారం 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు, మేనిఫెస్టోలో పథకాలను అమలు చేయడంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. దానికి బదులు వైఎస్సార్ సీపీ శ్రేణులపై కేసులు పెట్టడానికి మాత్రమే చంద్రబాబు, కూటమి నేతలు దృష్టి సారించారన్నారు. వారు అధికారం చేపట్ట ఏడాది కాలం పూర్తయినా, రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఒక్కటి చేపట్టలేదన్నారు.

ఆ ఘనత జగనన్నదే..

2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాల హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని రాజా అన్నారు. కోవిడ్ సమయంలో రెండేళ్ల రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా, పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే లక్షన్నర కోట్ల రూపాయల వరకు అప్పులు తీసుకువచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమ్మ ఒడి పథకంలో నగదు నేరుగా తల్లుల ఖాతాలోకి వెళ్లేదని, ఇప్పుడు తల్లులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. కూటమి అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజుల వచ్చాయన్నారు. కూటమి అకృత్యాలను ఎండగట్టేలా వైఎస్సార్ సీపీ పోరాటాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పిచ్చుకుల విజయ్ కుమార్, రావూరి రామరాజు పాల్గొన్నారు.